

తపాలా.. వసతుల్లో దివాలా

అరకొర వసతులు.. అద్దె భవనాలతో తపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

వివరాలు 10లో ▸



అనుమానాలు నివృత్తి చేయాలి

రైతుల అనుమానాలను నివృత్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు.

వివరాలు 10లో ▸



మూత'బడి'ంది

ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో రంజానాయక్ తండా బడి మూత పడింది.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ కలెక్టరేట్: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్యానల్ లాయర్స్, పారా లీగల్ వలంటీర్లకు బాల్య వివాహాలు.. తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి కరుణశీల, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, ప్యానెల్ లాయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని మిన్‌పూర్ 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పొడిచన్‌పల్లి, నార్సింగి, కొత్తపల్లి, అచ్చన్నపల్లి, గాజులగూడెం, కొడుపాక, కుర్తివాడ 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఇందిరమ్మ' సర్వే వేగవంతం చేయాలి



టేక్మాల్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సురేష్‌బాబు

టేక్మాల్(మెదక్)/చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను వేగవంతం చేయాలని మెదక్ డీఎల్‌పీఓ సురేష్ బాబు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం టేక్మాల్‌లో సర్వేను పరిశీలించారు. అనంతరం తంపులూరు పంచాయతీని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడడంతో పాటు ఇందిరమ్మ యాప్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్, ఎంపీఓ రియాజొద్దీన్, ఈఓ రాకేష్, పంచాయతీ కార్యదర్శి పోచయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే చిలప్‌చెడ్ మండలం చండూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నర్సాపూర్ డీఎల్‌పీఓ సాయిబాబా ఎంపీడీఓ ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. మండలంలో 85 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు.

రేగోడ్ పీహెచ్‌సీకి 108



రేగోడ్ పీహెచ్‌సీకి చేరుకున్న అంబులెన్స్

రేగోడ్(మెదక్): ఎట్టకేలకు రేగోడ్ పీహెచ్‌సీకి 108 మంజూరైంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంత్రి దామోదర రాజనర్సింహ 108 మంజూరు చేయగా.. కొంతకాలం తర్వాత మరో మండలానికి తరలించారు. దీంతో చాలా మందికి సకాలంలో వైద్యం అందక మృతిచెందారు. రేగోడ్‌లో 108 ఏర్పాటు చేయాలని గతంలో 'సాక్షి' పలు కథనాలను ప్రచురించింది. తాజాగా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మంత్రి 108 మంజూరు చేశారు. శుక్రవారం రాత్రి రేగోడ్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

కుక్కదాడిలో బాలుడికి గాయాలు

హవేళీఘణాపూర్(మెదక్): అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆడుకుంటున్న ఓ బాలుడిపై కుక్క దాడి చేసింది. మండలంలోని దూప్‌సింగ్ తండాకు చెందిన బొడావత్ శ్రీనివాస్ కుమారుడు సాయిదీప్ ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో గాయపడ్డాడు. బాలుడిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయం

తాత్కాలిక టీచర్ల నియామకానికి చర్యలు

- ఇప్పటికే ముగ్గురు ప్రత్యేకాధికారుల కేటాయింపు
- సమ్మెలోనే సమగ్ర శిక్షా ఉద్యోగులు
- జిల్లావ్యాప్తంగా 19 కస్తూర్బా విద్యాలయాలు

పరీక్షల వేళ 'కస్తూర్బా' విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలోనే ఉండడంతో కేజీబీవీల్లో తాత్కాలిక టీచర్ల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ముగ్గురు ప్రత్యేకాధికారులను సైతం నియమించింది. పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ వెలువడడంతో విద్యార్థులు నష్టపోకుండా.. బోధన కొనసాగించేలా విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది.



మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 19 కస్తూర్బా (కేజీబీవీ)లు ఉండగా.. అందులో సుమారు 6,000 పైచిలుకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. వాటిలో నాలుగు విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతుండగా.. మిగితా 15 విద్యాలయాల్లో 6 నుంచి పది వరకు తరగతులు కొనసాగుతున్నాయి. కాగా జిల్లాలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మొత్తం 600 వరకు ఉండగా, వారిలో కేజీబీవీల్లో 120 మంది విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. మిగితా 480 మంది డీఈఓ, ఎంఈఓ తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా తమను పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో వారంతా విధులు బహిష్కరించి సుమారు 25 రోజులుగా సమ్మెబాట పట్టారు. దీంతో కేజీబీవీల్లో బోధన పూర్తిగా నిలిచిపోయింది. కాగా ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ఉండగా, మార్చి 5వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ఉన్నాయి. అలాగే మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేజీబీవీల్లో సిలబస్ ఇప్పటికీ పూర్తికాలేదు. కాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ కళాశాలల్లో ఇప్పటికే పది, ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తి చేసి విద్యార్థులతో రివిజన్ చేయిస్తున్నారు. అంతే కాకుండా పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం ప్రారంభించారు. కేజీబీవీల్లో మాత్రం పాతికరోజులుగా బోధన నిలిచిపోవడంతో సిలబస్ పూర్తికాక విద్యార్థుల చదువు అటకెక్కింది.

రెండు రోజుల్లో బోధన ప్రారంభం

> కేజీబీవీల్లో పనిచేసే సిబ్బంది సమ్మెలో ఉండడంతో బోధన పూర్తిగా కుంటుపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి తాత్కాలిక బోధన సిబ్బందిని నియమించాలనే ఆదేశాలు రావడంతో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నియమిస్తున్నాం. మరో రెండు, మూడు రోజుల్లో బోధన ప్రారంభిస్తాం.
>
> – రాధాకిషన్, మెదక్ డీఈఓ

విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు

కేజీబీవీల్లో చదువుతున్న బాలికలు నష్టపోకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి డీఈఓకు ఇటీవలే స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌లో బోధించే సిబ్బందిని తాత్కాలికంగా కేజీబీవీల్లో నియమించి బోధన కొనసాగేలా ఆగమేఘాల మీద చర్యలు చేపట్టారు. ఇందుకోసం 120 మంది సిబ్బంది అవసరం కాగా.. ఇప్పటికే 10వ తరగతి, మోడల్ స్కూల్స్‌లో సిలబస్ పూర్తయిన పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించినట్లు తెలిసింది. అలాగే పర్యవేక్షణకు ముగ్గురు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మహిళల అభ్యున్నతికి మార్గదర్శి

- పూలే ఆశయాలను కొనసాగించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసినప్పుడే సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేరుతాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్య, సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ భర్త జ్యోతిబా పూలే ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తుచేశారు. మహిళలంతా ఆమె బాటలో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈఓ రాధాకిషన్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, సీపీఓ బద్రీనాథ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, ఇతర శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు పెట్టాలి

మెదక్‌జోన్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని అభివృద్ధిని వేగంగా పరుగులు పెట్టించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ నగేశ్‌తో సహా జిల్లా అధికారులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం నూతన సంవత్సరం సందర్భంగా తనను కలిసేందుకు వచ్చే అధికారులు, ఇతర నాయకులు బొకేలతో కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, నోట్‌బుక్‌లతో రావాలని కోరారు. దీంతో ఆయన కోరిక మేరకు చాలా మంది పెన్నులు, నోట్‌బుక్కులతో తరలివచ్చారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

డీఎంహెచ్ఓ శ్రీరాం

నర్సాపూర్: క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి డీఎంహెచ్ఓ శ్రీరాం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జాతీయ కార్యక్రమాలపై వైద్యులు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల టీబీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. టీబీతో పాటు మలేరియా, లెప్రసీ తదితర వ్యాధులపై దృష్టి పెట్టాలన్నారు. ఆయా వ్యాధుల లక్షణాలు కలిగిన వారిని గుర్తించి, సకాలంలో దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన టెస్టులు చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సంవత్సరంలో లక్ష్యాన్ని చేరాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డీఎంహెచ్ఓ కేక్ కట్ చేశారు.



న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్ఓ శ్రీరాం

చివరి ఆయకట్టుకు నీరు

మెదక్ కలెక్టరేట్: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా అధికారులు కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి యాసంగి సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సింగూరు ద్వారా ఘనపురం ఆయకట్టుకు 21,625 హెక్టార్లు సాగవుతుందని తెలిపారు. విడతల వారీగా సాగునీరు అందించడంలో సింగూరు నీటి అనుమతి కోసం లేఖ పంపించామన్నారు. ఈనెల 16 నుంచి మొదటి విడత సాగునీరు విడుదల చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో 2,694 మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 1,25,138 ఎకరాలు సాగవుతుందని తెలిపారు. సాగునీరు అందించడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో అనేక ఉపయోగాలు

సిద్దిపేటఎడ్యుకేషన్: కృత్రిమ మేధస్సు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్నిరంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, ఏఐతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఏఐపై రెండ్రోజుల జాయతీ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కరీంనగర్ లైఫ్‌లైన్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్, సదస్సు అధ్యక్షురాలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ముఖ్యవక్తలు ప్రొఫెసర్ శరత్‌బాబు, తమిళనాడు ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణచందర్ తదితరులు హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని విద్యా, పరిశోధనా రంగాల్లో సైతం అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. క్యాన్సర్ నివారణలో సైతం ఏఐని ఉపయోగించుకోవచ్చన్నారు. పరిశోధకులు ఏఐపై పట్టు సాధించాలని సూచించారు.

సామాజిక విప్లవకారిణి పూలే

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్ కలెక్టరేట్: మహిళల సమానత్వం కోసం, వారి అభ్యున్నతి కోసం ఉద్యమం చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'గో గేట్ ఎడ్యుకేషన్' కవిత ద్వారా పూలే అణగారిన వర్గాలకు విద్యాభ్యాసం గొప్పతనాన్ని వివరిస్తూ ప్రోత్సహించినట్లు చెప్పారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ప్రస్థానం ప్రారంభించిన ఆ మహనీయురాలు 17 పాఠశాలలను ప్రారంభించి మహిళా విద్యను ప్రోత్సహించిందని కొనియాడారు. ఆమె సేవలను గుర్తించే సీఎం రేవంత్‌రెడ్డి మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారని చెప్పారు. ఈసందర్భంగా నాయకుల విజ్ఞప్తి మేరకు బీసీ కమ్యూనిటీ హాల్ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నోముల శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీడబ్ల్యూఓ హైమావతి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సుజాత, చంద్రకళ, పట్టణ పార్టీ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు, బొజ్జ పవన్, న్యాయవాది జీవన్‌రావు, కౌన్సిలర్లు, టీఎన్జీఓ సంఘం బాధ్యులు దొంతి నరేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..

మీ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమగ్ర శిక్షా ఉద్యోగులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగే సమీక్షకు రాగా కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించారు.

బొందలగడ్డను వదలలే.



బొందలగడ్డను కబ్జా చేసి మొరం పోసిన దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా మారింది పలువురు నాయకుల తీరు. ప్రభుత్వ భూముల కబ్జా అటుంచి.. బొందలగడ్డను సైతం వదలడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.కోటి విలువ చేసే సుమారు 35 గుంటల భూమిని చదును చేసి మొరం పోసి ప్రహరీ నిర్మించేందుకు పూనుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కౌడిపల్లి నుంచి వెల్మకన్నకు వెళ్లేదారిలో ఎలుక చెరువు కట్ట అలుగు వద్ద బొందలగడ్డ ఉంది. గ్రామానికి చెందిన అన్నికులాలకు చెందిన చనిపోయిన వ్యక్తుల దహన సంస్కారాలు అక్కడ నిర్వహిస్తున్నారు. ఇటీవల ఎలుకచెరువు కట్ట సమీపంలో నర్సాపూర్‌కు చెందిన ఓ నాయకుడు గ్రామస్తుల వద్ద భూమి కొనుగోలు చేశాడు. పాసు పుస్తకంలో భూమి తక్కువగా వస్తుందని, రహదారికి ఆనుకొని ఉన్న బొందలగడ్డను చదునుచేసి కబ్జాకు పాల్పడుతున్నాడు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీనికి స్థానికంగా కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై గ్రామస్తులు ఇటీవల తహసీల్దార్ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని చెప్పినా.. పనులు మాత్రం ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బొందలగడ్డ కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు



పతకాలకు ఎంపికైన సిబ్బందితో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందిని తెలంగాణ మహోన్నత, ఉత్తమ, సేవ పతకాలకు ఎంపిక చేశామన్నారు. జిల్లా నుంచి 15 మంది ఎంపిక కాగా ఇందులో ఒక మహోన్నత సేవా పతకం, 14 మందికి సేవా పతకాలు లభించాయని తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి మహోన్నత పతకానికి ఎంపిక కాగా పోచయ్య, ఎస్ఐ (రేగోడ్), అశోక్, ఏఎస్ఐ (రేగోడ్), పెంటప్ప ఏఎస్ఐ (అల్లాదుర్గ్), దేవిదాస్ ఏఎస్ఐ (అల్లాదుర్గ్), శివకుమార్, జమీల్ అబ్దుల్లా, లక్ష్మీనారాయణ, ఏఆర్ఎస్ఐ, డీఏఆర్ (మెదక్), రామానుజన్, కిష్టయ్య, జాఫర్, చంద్రప్ప, యాదగిరి, భూమయ్య సేవా పతకాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా సిబ్బందిని ఎస్పీ అభినందించారు. పతకాలను త్వరలోనే అందిస్తామని చెప్పారు.

నర్సాపూర్‌లో విషాదఛాయలు

నర్సాపూర్ రూరల్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్ పంచాయతీరాజ్‌శాఖలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న పాపగారి మనిషా (24), నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేటకు చెందిన విద్యార్థిని ఐశ్వర్య (20) మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఐశ్వర్య స్నేహితులు బోరున విలపించగా.. ఏఈ మనిషా మృతి విషయం తెలుసుకున్న పంచాయతీరాజ్‌శాఖ డీఈ రాధికారెడ్డి, ఇతర ఏఈలు కంటతడిపెట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చారు.



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కూడళ్లు మారవు.. కష్టాలు తీరవు

రామాయంపేట మున్సిపాలిటీలో తరచూ ప్రమాదాలు



మెదక్ రోడ్డు మార్గంలో కూడలి దుస్థితి

రామాయంపేట(మెదక్): ప్రధాన కూడళ్ల విస్తరణ అభివృద్ధికి దిక్సూచి కాగా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో వాటి విస్తరణ విషయమై అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇరుకుగా ఉన్న చౌరాస్తాల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రామాయంపేట– మెదక్ రూట్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద, సిద్దిపేట రోడ్డు మలుపు వద్ద ప్రధాన కూడళ్లు ఉన్నాయి. రోడ్డు విస్తరణ, అడ్డుగా ఉన్న కరెంటు స్తంభాలను తొలగించకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. మెదక్ రూట్‌లో జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద నుంచి దళితకాలనీ వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. అయితే కూడళ్ల వద్ద ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఈవిషయమై పట్టణ ప్రజలు పలుమార్లు ఆందోళన చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. కూడళ్ల విస్తరణ చేపడుతామని, అందంగా, విశాలంగా తీర్చిదిద్ది అక్కడ మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా సిద్దిపేట రోడ్డు మలుపు వద్ద ఉన్న కూడలి ప్రమాదాలకు నెలవుగా మారింది. మధ్యలో ఉన్న వివేకానంద విగ్రహం వద్ద రోడ్డు ఇరుకుగా మారింది. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌ను వివరణ కోరగా.. కూడళ్ల విస్తరణ విషయమై గతంలోనే ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతామన్నారు.



ఇరుకుగా సిద్దిపేట రూట్‌లోని కూడలి

క్లుప్తంగా

విద్యార్థులకు కథల పోటీలు

ఫిబ్రవరి 25 చివరి గడువు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించి, తద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో ఉగాది బాలల కథల పోటీ- 2025కి విద్యార్థుల కథలను ఆహ్వానిస్తున్నట్లు సుగుణ సాహితీ సమితీ కన్వీనర్‌ భైతి దుర్గయ్య శుక్రవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కథలను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.1,500, రెండు ద్వితీయ బహుమతులు రూ.1,000 చొప్పున, మూడు తృతీయ బహుమతులు రూ.500 చొప్పున, రూ.300 చొప్పున 12 ప్రత్యేక బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. బహుమతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకష్టారెడ్డి అందించనున్నట్లు పేర్కొన్నారు. హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము రాసిన కథలను ఫిబ్రవరి 25 లోగా జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో అందించాలన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ



పంట పొలంలో బోల్తాపడిన లారీ

తొగుట(దుబ్బాక): లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేట శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ గురువారం తెల్లవారు జామున గ్రామ శివారులో పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. డ్రైవర్‌ అజాగ్రత్త అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

సైబర్‌ వలలో ఐటీ ఉద్యోగి

రూ.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్‌: షేర్ల పేరుతో ఐటీ ఉద్యోగి నుంచి సైబర్‌ నేరస్తులు డబ్బులు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్‌ సీఐ రాజు కథనం మేరకు.. పటాన్‌ చెరు గౌతం నగర్‌ కాలనీకి చెందిన ఓ ఐటీ ఉద్యోగికి డిసెంబర్‌ 19వ తేదీన సైబర్‌ నేరస్తులు ఫోన్‌ చేసి, ఇనిస్ట్యూషనల్‌ అకౌంట్‌ ట్రేడింగ్‌ లో షేర్లు కొనుగోలు చేస్తే లాభాలు వస్తాయని చెప్పి నమ్మించారు. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.5 లక్షలు వారి ఖాతాలో జమ చేశాడు. అనంతరం సైబర్‌ నేరస్తులు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి వాలీబాల్‌ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అక్షయను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాక: జాతీయస్థాయి అండర్‌–19 వాలీబాల్‌ పోటీలకు దుబ్బాక మున్సిపల్‌ ధర్మాజీపేట జెడ్పీహెచ్‌ఎస్‌ పూర్వ విద్యార్థిని కర్నాల అక్షయ ఎంపికైంది. డిసెంబర్‌లో నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. విద్యార్థిని జనవరి 6 నుంచి విజయవాడలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా అక్షయను ఘనంగా సన్మానించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు, హెచ్‌ఎంలు సాదత్‌అలీ, నాగభూషణం, సంజీవయ్య, జానకీరామ్‌, నాగరాజు, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తపాలా.. వసతుల్లో దివాలా

అద్దె భవనాల్లో పోస్టాఫీసులు

- అరకొర వసతుల నడుమ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- సొంత భవనాలు లేక రూ.లక్షల్లో కిరాయి చెల్లింపు
- వినియోగదారులకు తప్పని ఇక్కట్లు
- మెదక్‌, సిద్దిపేట జిల్లాల్లోని కార్యాలయాల్లో అధ్వాన పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి :	
ప్రధాన తపాలా కార్యాలయాలు :	2
ఉప కార్యాలయాలు :	40
శాఖ కార్యాలయాలు :	243
సొంత భవనాలు :	5
అద్దె భవనాల్లో:	280



తూప్రాన్‌లో ఇరుకు గదుల్లో కొనసాగుతున్న తపాలా కార్యాలయం



చేగుంటలో అద్దె గదిలో కార్యాలయం

తూప్రాన్‌: అరకొర వసతులు.. అద్దె భవనాలతో తపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మెదక్‌, సిద్దిపేట జిల్లాలోని ఉప తపాల కార్యాలయాలకు నేటికీ సొంత భవనాలు లేవు. దీంతో తపాలా సేవలు వినియోగించుకునేందుకు వచ్చే వారికి ఇక్కట్లు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లోనైతే నివాస గృహాల్లోనే కొనసాగిస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఖాతాదారులకు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని పరిస్థితి. అద్దె భవనాలు కార్యాలయ నిర్వహణకు కేంద్రం చెల్లించే నగదు సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

మెదక్‌, సిద్దిపేట ప్రధాన తపాలా కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. అలాగే దుబ్బాక, రామాయంపేట, మక్కారాజ్‌పేటలో మాత్రమే సొంత భవనాల్లో తపాలా కార్యాలయాలు కొనసాగుతున్నాయి. మిగితా ప్రాంతాల్లో అద్దె భవనాలు, నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. 163 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తపాల శాఖ ప్రజల మన్ననలు పొందుతూ ఎన్నో కొత్త సేవలకు శ్రీకారం చుడుతుంది. అంతా బాగున్నా కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చే ఆలోచన చేయక రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుంది.

ఎన్నో రకాల సేవలు అందుబాటులో..

గ్రామీణ తపాలా బీమా, రికవరీ, పొదుపు ఖాతాలు, పరిమిత కాల డిపాజిట్లు, రైతుబంధు, జాతీయ పొదుపు పత్రాలు, ఆధార్‌ అనుసంధానం, ఆధార్‌ సహిత చెల్లింపులు, కిసాన్‌ వికాస్‌ పత్రాలు, ఆన్‌లైన్‌ బ్యాంకింగ్‌ ఇలా ఎన్నో సేవలు అందిస్తున్న ఉప తపాల కార్యాలయాల్లో సరైన వసతులు లేవు. గదులు ఇరుకుగా ఉండటంతో సేవలు పొందేందుకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా మహిళా ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌లో చేర్పులు, మార్పులు, నమోదు కోసం నిత్యం ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి. కానీ సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు.

రక్షణ కరువు

చాలా ఉప తపాల కార్యాలయాలకు ప్రహరీలు లేవు. కాపలాదారులు లేరు. కార్యాలయాల్లో విలువైన బీమా పత్రాలు, నగదు చెల్లింపులు, పింఛన్‌ డబ్బులు, ప్రభుత్వ పథకాల డబ్బులు, సాంకేతిక పరికరాలు, జనరేటర్లు, కంప్యూటర్లు ఉంటాయి. అద్దె భవనాల్లో కొనసాగడంతో విలువైన సామగ్రి పత్రాలు, డబ్బులకు రక్షణ కరువైంది. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో గజ్వేల్‌, తూప్రాన్‌, అక్కన్నపేట, చేగుంటలో సొంత భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తపాలా శాఖకు చెందిన ఓ ఉద్యోగి తెలిపారు. సొంత భవనాల్లో కార్యాలయాలు ఏర్పాటు అయితే ప్రజలకు నాణ్యమైన సేవలు అందనున్నాయి.

స్థలం కబ్జా

తూప్రాన్‌ డివిజన్‌ కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌కు సమీప దూరంలో దశాబ్దాల కిందట తపాలా కార్యాలయం ఏర్పాటు కోసం అధికారులు సుమారు 600 గజాలకు పైగా స్థలం కేటాయించారు. గజానికి సుమారు రూ.లక్ష వరకు మార్కెట్‌ విలువ కలిగి ఉంది. ప్రస్తుతం కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేయగా, మరికొంత సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. నేడు కేవలం 200 గజాలు మాత్రమే మిగిలిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తపాలా శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సొంత భవనం నిర్మించాలని కోరుతున్నారు.



కబ్జాకు గురైన తపాలా కార్యాలయం స్థలం

ఇబ్బందులు పడుతున్నాం



పోస్టాఫీసు ఇరుకైన గల్లీలో ఉంది. ఇక్కడ కనీసం కూర్చుందామన్నా కుర్చీలు అందుబాటులో లేవు. గంటల కొద్దీ నిలబడాల్సి వస్తుంది. ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి. అద్దె భవనాలకు బదులు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.

–వసంత, వినియోగదారురాలు

సౌకర్యాలు కల్పించాలి



పోస్టాఫీసులో డబ్బులు జమ చేయాడానికి వస్తే ఇక్కడ సరైన వసతులు లేవు. కనీసం రాయడానికి బల్లాలు లేవు. నేలపై కూర్చోవాల్సి వస్తుంది. ప్రభుత్వం అన్ని చేస్తున్నామని చెబుతుంది కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు. అత్యవసరమైతే కనీసం మూత్రశాలలు లేవు. అధికారులు స్పందించి మంచి సౌకర్యాలు చేయాలి.

–సాదీక బేగం, వినియోగదారురాలు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

గజ్వేల్‌రూరల్‌: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ డిక్లరేషన్‌ అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ ఏడాది గడిచినా ఎందుకు అమలు చేయడం లేదని ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ప్రశ్నించారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ సదస్సుకు శుక్రవారం గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహించిన అనంతరం తరలివెళ్లారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. కామారెడ్డిలో ప్రకటించిన బీసీల డిక్లరేషన్‌పై కాలయాపన చేయడం తగదన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలను నమ్మించి వారి ఓట్లతో గెలుపొంది, అధికారంలోకి రాగానే బీసీలను విస్మరించిందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్‌ అమలుకు డిక్లరేషన్‌ కమిటీ వేసి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. డిక్లరేషన్‌ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలన్నారు. బీసీలకు లక్ష కోట్లతో సమగ్రాభివృద్ధి చేపట్టాలని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లను వర్తింపజేయాలని, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయని పక్షంలో బీసీల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు పెద్దపీట



పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ అనురాధ

- పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత
- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సిద్దిపేట పోలీసు కమిషనర్‌ అనురాధ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంతో కలిసి సీపీ శుక్రవారం కేక్‌ కట్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు, ప్రజల సేఫ్టీ, సెక్యూరిటీకి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. నూతన ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. 2024లో శాంతి భద్రతల విషయంలో మెరుగైన సేవలందించినందుకు సిబ్బందిని అభినందించారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందించాలన్నారు. ప్రజలు సైబర్‌ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని, సైబర్‌ నేరాలు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌ అదనపు డీసీపీలు రామచంద్రరావు, సుభాష్‌ చంద్రబోస్‌, ఏసీపీలు మధు, పురుషోత్తం రెడ్డి, సతీష్‌, యాదగిరి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్‌ కిరణ్‌, శ్రీధర్‌, వన్‌ టౌన్‌ సీఐ వాసుదేవరావు, టూటౌన్‌ సీఐ ఉపేందర్‌, త్రీ టౌన్‌ సీఐ విద్యాసాగర్‌, రూరల్‌ సీఐ శ్రీను, ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్‌, ఐదుగురు పరారీలో..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్‌



గంజాయిని చూపుతున్న ఎస్పీ, తదితరులు

సంగారెడ్డి జోన్‌: అక్రమంగా రవాణా చేస్తున్న ఎండుగంజాయి పట్టుకున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్‌ తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహ్మద్‌ అక్బర్‌, మహ్మద్‌ సల్మాన్‌, ఇస్మాయిల్‌ అతడి అనుచరులు మహబూబ్‌, రజాక్‌ మారుతీ కారులో ఒరిస్సా బార్డర్‌ నుంచి హైదరాబాద్‌ మీదుగా ముంబాయికి గంజాయి తరలిస్తున్నారు. వీరికి చెందిన మరో ఇద్దరు నవాజ్‌, షబ్బీర్‌ ముందు కారులో వెళ్తూ గంజాయి తీసుకొస్తున్న ఐదుగురికి సిగ్నల్‌ ఇస్తున్నారు. గంజాయి తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు జహీరాబాద్‌ శివారులోని పాత ఆర్టీఓ చెక్‌పోస్ట్‌ సమీపంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో పోలీసులు వీరి కారును ఆపగా వాహనాన్ని నిలుపకుండా వెళ్లారు. కొద్దిదూరం వెళ్లాక కారు ఆపి అందులోని ముగ్గురు పరారీ కాగా, ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద సుమారు రూ.30 లక్షలు విలువ చేసే 110 కేజీలు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దొరికిన వారిలో మహ్మద్‌ అక్బర్‌, మహ్మద్‌ సల్మాన్‌ ఉండగా మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. జహీరాబాద్‌ టౌన్‌ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, జహీరాబాద్‌ డీఎస్పీ రామ్‌ మోహన్‌ రెడ్డి, టీనాబ్‌ డీఎస్పీ పుష్పన్‌ కుమార్‌, జహీరాబాద్‌ టౌన్‌ ఇన్‌స్పెక్టర్‌ శివలింగం, ఎస్‌ఐలు కాశీనాథ్‌, ప్రసాద్‌ రావు, సిబ్బంది ఉన్నారు.

కుమారుడు మందలించాడని తల్లి ఆత్మహత్యాయత్నం

పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



గంగమణి (ఫైల్‌)

కొమురవెల్లి(సిద్దిపేట): పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గురువన్నపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరపు గంగమణి (40)కి ఇద్దరు కుమారులు. గత నెల 24న చిన్న కుమారుడు వివాస్‌ అల్లరి చేయడంతో తల్లి కొట్టింది. దీంతో పెద్దకుమారు వంశీ తమ్ముడిని ఎందుకు కొడుతున్నావని తల్లిని మందలించాడు. ఈ క్రమంలో క్షణికావేశంలో గంగమణి ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి..



మహేశ్‌ (ఫైల్‌)

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ముండ్రాయిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనంతారం పీటీ మల్లూర్‌ గ్రామానికి చెందిన పోలెబోయిన మహేశ్‌ (30) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ బతుకుదెరువు కోసం ముండ్రాయికి వచ్చాడు. మరో ముగ్గురితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున నిద్రలేచిన తోటి పనివారు మహేశ్‌ కనబడకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద అతడి చెప్పులు కనబడటంతో అందులో పడినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్‌ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణం

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి



బాల్‌నర్సయ్య (ఫైల్‌)

కొమురవెల్లి(సిద్దిపేట): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి బాల్‌నర్సయ్య(40) పదిహేను ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో ఆటో సరిగా నడవకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

ఉరేసుకొని వృద్ధురాలు..



విమల (ఫైల్‌)

దుబ్బాకటౌన్‌: ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన అబ్బతిని విమల(63) కుమారుడు రాజేశ్‌, కోడలు, మనవడితో జీవిస్తుంది. కుమారుడు పట్టణంలో వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా విమల తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం కుమారుడు చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. మృతురాలి కుమారుడు రాజేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి వృద్ధురాలు..



అంజమ్మ మృతదేహం

తూప్రాన్‌: చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. బ్రాహ్మణపల్లికి చెందిన అంజమ్మ(62) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చెరువు కట్టపై అంజమ్మ ధరించిన స్వెటర్‌ గమనించిన కుటుంబ సభ్యులు నీళ్లలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యం తాళలేక వ్యక్తి..



మధు(ఫైల్‌)

సిద్దిపేటరూరల్‌: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పుల్లూరు గ్రామానికి చెందిన రామగల్ల మధు (35) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ బాధను భరించలేక శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్క్రాప్‌ డీసీఎంలో మంటలు



డీసీఎంలో చెలరేగిన మంటలు

చిన్నశంకరంపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు స్క్రాప్‌ డీసీఎంలో మంటలు చెలరేగిన ఘటన చిన్నశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఖాజాపూర్‌ స్టీల్‌ పరిశ్రమకు హైదరాబాద్‌ నుంచి పాత ఇనుప సామగ్రి స్క్రాప్‌ తీసుకొచ్చిన డీసీఎం కంపెనీ గేట్‌ వద్ద నిలిపారు. వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం గమనించిన డీసీఎం డ్రైవర్‌ వాహనం దిగి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలార్పి వేశారు. పాత ఇనుప సామగ్రిలో పాడైన గ్యాస్‌ సిలిండర్లు కూడా ఉన్నాయని అందులోంచే మంటలు రావొచ్చని డీసీఎం డ్రైవర్‌ అనుమానం వ్యక్తం చేశారు. వాహనం స్వల్పంగా కాలిపోయింది.

పాత కక్షలతోనే ప్రాణాలు తీయాలనుకున్నాడు

- మద్యంలో విషం కలిపి హత్యాయత్నం
- తాగడంతో ఆస్పత్రిపాలు
- ముగ్గురు నిందితులు అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): పాత కక్షలతో మద్యంలో విషం కలిపి ఓ వ్యక్తి ప్రాణాలు తీయాలనుకున్న ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్‌రూరల్‌ సీఐ మహేందర్‌ రెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామంలో జరిగిన ఘటనపై శుక్రవారం పోలీస్‌ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన నీరుగంటి నర్సింలు, గరిదాసు గోపీకి వ్యవసాయ పొలానికి వెళ్లే బాట విషయంలో పంచాయితీ నడుస్తోంది. నర్సింలును చంపితేనే తన వ్యవసాయ పొలానికి బాట సాఫీగా ఉంటుందని గోపీ స్నేహితులతో కలిసి రెండు నెలలుగా పథకం వేశాడు. పథకం ప్రకారం స్నేహితులతో కలసి గత నెల 18న గజ్వేల్‌లో వైన్స్‌ దుకాణంలో మద్యం తీసుకున్నారు. అందులో గడ్డి నివారణకు వాడే పురుగు మందును కలిపి నీరుగంటి నర్సింలు గుడిసెలో పెట్టారు. అనుమానం రాకుండా పేకాట ముక్కలు, తాగిన గ్లాసులు పెట్టి రాత్రి వెళ్లిపోయారు. 19న గుడిసెలోకి వెళ్లిన నర్సింలు మద్యాన్ని ఎవరో తాగి వదిలి వేశారని అనుకొని తన మామ మెండే కనకయ్య, నీరుగంటి అయిలయ్య, విఘ్నేష్‌లను పిలిచి మద్యాన్ని తాగారు. దీంతో వారు అస్వస్థతకు గురై గజ్వేల్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు మద్యంలో పురుగు మందు కలిసిందని తెలిపారు. ఈ ఘటనపై 26 కనకయ్య కుమారుడు ప్రవీణ్‌ జగదేవ్‌పూర్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ చంద్రమోహన్‌ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనుమానితులైన తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన గరిదాసు గోపి, రాచమల్ల స్వామి, కొంతం అయిలయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ చంద్రమోహన్‌, పోలీస్‌ కానిస్టేబుల్‌ పాల్గొన్నారు.

రైతుల అనుమానాల్ని నివృత్తి చేయాలి

- రామాయంపేటలో బై పాస్‌ రోడ్డు నిర్మాణం
- నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం
- మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్‌: రామాయంపేట బైపాస్‌ రోడ్డు నిర్మాణ విషయంలో రైతుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం అధికారులపై ఉందని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్‌ నుంచి సిద్దిపేట వరకు 69 కిలోమీటర్లు ఎస్‌హెచ్‌–76 రోడ్డు నిర్మాణం జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇందులో భాగంగా రామాయంపేట బైపాస్‌ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులతో శుక్రవారం కలెక్టరేట్‌ కార్యాలయంలో మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు, నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ రావు, కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌, అదనపు కలెక్టర్‌ నగేశ్‌, నేషనల్‌ హైవే ఈఈ బలరామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులతో ఎంపీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 2.65 కిలోమీటర్ల బైపాస్‌ రోడ్డు నిర్మాణంలో భూములు కొందరు భూములు కోల్పోతారని ఇందుకు సహకరించాలన్నారు. ఈ విషయంలో ఆర్డీవో, తహసీల్దార్‌ స్థాయి అధికారి క్షేత్రస్థాయి సర్వే ద్వారా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ.. నిర్వాసితులకు రిజిస్ట్రేషన్‌ ధరలకు అనుగుణంగా పరిహారం అదే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రోహిత్‌ రావు మాట్లాడుతూ.. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో మెదక్‌ ఆర్డీఓ రమాదేవి, డీఈ అన్నయ్య, ఏఈ మురళీకృష్ణ, రామాయంపేట తహసీల్దార్‌ రజని, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.